సమస్యని పరిష్కరించకుండా మరేసంగతి ఎత్తినా ప్రజలు వినరు. అందుకనే మిగిలిన ఉద్యమాలు సఫలత పొందటం లేదు, ప్రజల్లోకి వెళ్ళటంలేదు - పైపైనే పుట్టి, పైపైనే నశిస్తున్నాయి. ఇలా జరుగుతూవుందని వాపోవటంలో అర్థం లేదు. సంఘ శ్రేయస్సుకోసం పరిస్థితులనుబట్టి పాటు బడాలిగాని, అవసరంగా కినపడని భావాలను వాళ్ళ తలలకు ఎక్కించటానికి ప్రయత్నిస్తే వృథాయే అవుతుంది.

కనక మానవుడు తను జీవించివున్నంతకాలం అత్యవసర సమస్యని పరిష్కరించటానికై ప్రయత్నించాలి. ఈ సమస్య పరిష్కరించబడ్డా మరొక సమస్య వొస్తుందని వూరుకో కూడదు. పద్ధతి ఏది అనుసరించినా, జీవితాదర్శం ప్రతి మానవుడికీ, 'ఈ లోకాన్ని వాసయోగ్యం చెయ్యటమే !' అనే విషయం ఎవ్వరూ మరచిపోగూడదు.

—o—

# రెటమత సిద్ధాంతం

రెటమతం అనే మాట మనం రోజూ వింటూనే ఉంటాం. మనం ఒక నూతనోద్దేశం వెలిబుచ్చగానే, అది ప్రజాసామ్యానికి వికటంగా కనిపిస్తుంది. వెంటనే మన ప్రక్కనున్న ఒకడు 'రెటమతం' అంటాడు. రెండోవాడు లౌక్య మర్యాదలతో, తెలివిగలవాడేగాని అంతా 'రెటమతం' అంటాడు. ఏమిటీ రెటమతం? దీని స్వభావం ఎటువంటిది?

'అవునన్నది కాదనటం రెటమతం' అని తేలిగ్గా నిర్వచనం చేస్తారు. ఎవ్వరు అవునన్నది? ప్రజాబాహుళ్యం అవునన్నది కాదనటం రెటమతంగా కొందరు అర్థంచేసుకుంటున్నారు. ఈ రెటమతసిద్ధాంతం ప్రాముఖ్యతనుఅర్థంచేసుకోటానికి మనం ఒక ప్రశ్న వేసుకోవలసి వస్తుంది. "ఒక ఉద్యమ నాయకులు ప్రజాబాహుళ్యాన్నిబట్టే పోవాలా, లేక ప్రజా బాహుళ్యాన్ని తమ దృక్పథానికి తిప్పుకోటానికి ప్రయత్నించాలా?" అనేది. నాయకులు ప్రజాబాహుళ్యం అభిప్రాయాలకు అనుగుణంగా గంతులువేసి పేరు సంపాదించుకోటాన్ని లెనిన్ 'tailism' అని హేళన చేశాడు. అచ్చగా ప్రజాసామాన్యం పలవరింతలకే తందనాలు తొక్కితే, సంఘంలో అభివృద్ధి అనేదే ఉండదు. ఇటువంటి నాయకత్వం "తానని వాని నూతగోని కానని వాడు విశిష్టవస్తువుల్ కానని భంగి"గా తయారవుతుంది. కనుక మానవుడు వేసినచోటే ఉంటాడు. లేకపోతే సుడిగుండంలో పడి కొట్టుకుంటాడు.

ఎప్పుడైతే మనం ప్రజాబాహుళ్యం దృక్పథాన్ని మార్చటానికి ప్రయత్నిస్తామో, అప్పుడే ప్రజాబాహుళ్యం తాత్కాలికంగా ఎదురుతిరగటం, హేటమతం అని నిందించటం తటస్థిస్తుంది. 'దేవుడున్నాడు' అని ప్రజాబాహుళ్యం నమ్మినప్పుడు 'దేవుడు లేడు' అని చెప్పటం హేటమతంగా పరిగణింపబడుతుంది. 'రాముడు దేవుడు' అనుకునే రోజుల్లో 'రాముడు మానవుడు', అని చెప్పటం హేటమతంగా పరిగణింపబడుతుంది. 'భూకంపాలు ఆ మాయామానుష విగ్రహుని లీలావినోదాలు' అనుకునేరోజుల్లో వాటికి సైంటిఫిక్ కారణాలున్నాయని చెప్పటం హేటమతంగా పరిగణింపబడుతుంది.

'మీరు చెప్పేది సహేతుకంగా ఉంటే అది హేటమతం కాదు' అని కొందరు వాదిస్తారు. బాగానే ఉంది. కాని ఒక నూతనోద్దేశం సహేతుకమో-నిర్హేతుకమో తెలుసుకోటానికి ప్రజాసామాన్యం కొంత టైము తీసుకుంటుంది. ఈ విషయంలో ప్రజాసామాన్యం జ్ఞానాన్ని అనుభవంవల్ల సంపాదించుకుంటుందిగాని బుద్ధిబలంవల్లకాదు. అందువల్ల ఒక నూతనోద్దేశాన్ని వెలిబుచ్చగానే ప్రజాసామాన్యం, తరువాత ఆ ఉద్దేశాన్ని అంగీకరించినా, వెంటనేమాత్రం 'హేటమతం' అంటుంది. సహేతుకమైన విషయాన్ని వెంటనే గ్రహించే శక్తి ప్రజాసామాన్యానికి లేకపోబట్టే, తన విశ్వాసాలను వదలుకొని వెంటనే హేతువాదాన్ని అంగీకరించలేదు కాబట్టే, అది గెలిలియో ప్రాణాలను కోరింది. ఏసుక్రీస్తును సిలువ ఎక్కించింది. ఆస్కార్ వైల్డుని దేశం నుంచి తరిమివేసింది. మహమ్మదుచేత కత్తిని పట్టించింది. ఇంకెన్నెన్నో చేసింది.

కనుక 'ప్రజాసామాన్యాన్ని నేను ఆకర్షించాను' అని ప్రగల్భాలు కొట్టటం గొప్పకాదు. అత డేపద్ధతితో ప్రజాసామాన్యాన్ని ఆకర్షించాడో మనం తెలుసుకోవాలి. జాన్సన్ చెప్పినట్టు ప్రజాసామాన్యం నాన్‌సెన్సూ అతని నాన్‌సెన్సూ ఒకటే అవటంవల్ల అది అతనివల్ల ఆకర్షించబడిందా? నీతిబాహ్యమైన మాటలు వాడటంవల్లో, అటువంటి ఉద్దేశ్యాన్ని స్ఫురణకు తేనటంవల్లో, దాని పైత్యాన్ని రేపటంవల్లో, అది ఆకర్షించబడిందా? అని మనం ఆలోచించాలి. ఆ పద్ధతి మంచిదై దానివల్ల సంఘానికి లాభం కలిగితే సెబాస్ అని మనం హారతులు పట్టాలి. లేకపోతే ఆ ఆకర్షించినవాడూ, ఆ ఆకర్షించబడినవారూ నరకానికి పోతారు.

ప్రజాబాహుళ్యం అనేకవిధాలగా ఆకర్షించబడుతుంది. వ్యభిచారాన్ని గురించి రాస్తే అనేకులు ఆకర్షించబడుతారు. ఎవ్వర్నో పట్టుకొని బండబూతులు తిడితే కొందరు సంతోషిస్తారు. చిత్రకార్తి కుక్కల చేష్టలు వర్ణిస్తే 'వహ్వా' అంటారు. నగ్నదృశ్యాలు చూపితే లొట్టలు వేసుకుంటూ చూస్తారు. అంతమాత్రాన యీ విధంగా రంజింపచెయ్యటం గొప్ప అవుతుందా? దీనికంటే ప్రజాబాహుళ్యానికి ఇష్టం లేకపోయినా, దానివల్ల చెప్పేవాడు నష్టకష్టాలకు లోనయినా, సంఘ శ్రేయస్సుకు ప్రయత్నించటమే మంచిది. దాన్ని ప్రజాబాహుళ్యం 'రెటమతం' అని నిందించి, అతడిని హింసించినా, కొన్నాళ్ళకయినా యదార్థం తెలుసుకొని బాగుపడుతుంది.

ఇప్పుడు నే నున్నాననుకోండి—ప్రవక్తలతో పోల్చు కోవటం కాదు—నాకు ప్రజాసామాన్యంలో ఇప్పుడు ప్రబలంగావున్న రుచి యిష్టంగా ఉండదు. ప్రజాసామాన్యం ఒక రుచికి అలవాటు పడటంవల్ల, రాజకీయంలో చూచినా సారస్వతంలో చూచినా, సినిమాల్లో చూచినా ఆ రుచే కనబడుతుంది. ఆ రుచి మంచిదిగా నాకు కనబడకపోవటంవల్ల రాజకీయంలో, సారస్వతంలో, సినిమాలలో, ప్రజల అభిరుచికి వ్యతిరేకంగా ఆ రుచిని విమర్శించవలసి వస్తుంది. ఈవిధంగా ప్రతి శాఖలోనూ ప్రజాసామాన్యంతో ఏకీభవించక పోవటంవల్ల అందరూ అనునన్నది కాదనే మేనియా నా కున్నదనీ, నేను అదొక సిద్ధాంతంగా పెట్టుకొని కూచున్నాననీ నన్ను నిందించటం కేవలం పొరపాటు. ఇప్పుడు ప్రజలలో ఉన్న రుచిని నేను అంగీకరించటం లేదు. ఆ రుచి ఏ శాఖలో కనుపించినా నేను విమర్శిస్తున్నాను. ఆ రుచిని ఒక శాఖలో నిందించి, ఒక శాఖలో పొగడటం తప్పుగాని, ఆ రుచి కనబడిన చోటల్లా విమర్శించటం తప్పుకాదు.

కనుక రెటమత సిద్ధాంతం అనగానే బెదిరిపోవలసిన పని లేదు. ఇప్పుడు నాకు అర్థంకాని నూతనోద్దేశాన్ని నేను రెటమతం అంటున్నాను. మీకు అర్థంకాని నూతనోద్దేశం మీకు రెటమతంగా కనిపిస్తోంది. హాలీవుడ్ ఫిలుములు చూచి హిందీ ఫిలుములను విమర్శించేవాడు, తెలుగు ఫిలుములతో హిందీ ఫిలుములను పోల్చి చూచుకొని మురుసుకునే వాడికి రెటమతస్థుడుగా కనబడతాడు. తెలుగు ఫిలుములతో

ఫోల్చుకొని హిందీ ఫిలుములను పొగిడేవాడు, హాలీవుడ్ ఫిలుములు చూచినవాడికి రెటమతస్థుడుగా కనబడతాడు.

ఈ రెటమత సిద్ధాంతం జాగ్రత్తగా పరిశీలించవలసిన సిద్ధాంతం. ఇది తెలియనివాళ్లు ప్రచారం చేస్తున్నంత, పైకి కనబడేంత పిచ్చిసిద్ధాంతం కాదు. దీనిభావం తెలుసుకోవటం మీాదే, దీని హృదయాన్ని అర్థం చేసుకోవటంమీాదే, సంఘాభివృద్ధి ఆధారపడి ఉంది.

## అహం

ఒక కవి ఒక సభలో ఈ విధంగా ఉపన్యసిస్తున్నాడు—

"మీరు కనిపెట్టారో లేదోగాని నేను తిక్కన కంటే గొప్ప వాణ్ణి. నా కవిత్వంలో తిక్కన కవిత్వంలో వున్న గుణాలకంటే గొప్ప గుణాలున్నవి. ఇంతవరకు భారత దేశంలో పుట్టినవాళ్ళలో తిక్కన కంటే గొప్ప కవిని నే నే...."

ఒక సభికుడు చివాలున లేచి—"తిక్కన కంటే మీరు గొప్ప కవులనుకోటానికి దృష్టాంతరం ఏమిటి ?"

"దృష్టాంతరమా ?....దృష్టాంతరమా," అని నట్లు కొట్టటం మొదలుపెట్టాడు కవి.

ఇంకొక సభికుడు లేచి ఈ విధంగా జవాబు చెప్పాడు— "దృష్టాంతరాలకేం ! కావలసినన్ని వున్నాయ్. తిక్కనా కవిత్వం రాశాడు; వీరూ కవిత్వం రాశారు. తిక్కనా పుట్టాడు; వీరూ పుట్టారు. వీటినిబట్టి తిక్కనకూ వీరికీ చాలా పోలిక లున్నవని విశదం అవుతూవుంది. ఇక తిక్కనకంటే ఈయన గొప్పవా డెలాగంటారా ? తిక్కన చచ్చాడు; ఈయన చావలేదు...." అని కూర్చున్నాడు.

కవి తెల్లమొహం వేశాడు.